
Assembles Of The Living Elohim(1.Tim 3:15), India Presents.................

Satyamunakai Poratam REGD. NO. 67970/97

# సత్యమునకై పోరాటం

జీవముగల ఎలోహీం సమాజము




Editor & Publisher : Bro. Isaac E. Kusuma, MALIKIPURAM - 533 253 E.G.Dt. (A.P.) India
Website : www.aotle-india.org
E-mail : info@aotle-india.org
Office Ph : 98493 85038

Regd. Monthly Newspaper
Postal Regd. No. H/APM/01
Valid upto 12/2009 Posted on 30th of Every Month
Annual Subscription Rs.50/-

To :

VOLUME: 13 SIVAN-TAMMUZ 5769 (June- 2008) Pages : 4 Issue : 126

హెచ్చరిక : ఈ పత్రిక ఖండితముగా సత్యాన్వేషుల కొరకు మాత్రమే గాని, క్రైస్తవ మతశాఖల వారి కొరకు కాదు.

# తెలుగు బైబిలు చరిత్ర

సత్యవేదమను ఈ పరిశుద్ధ గ్రంథము మన తెలుగు భాషలోనికి ఎట్లు వచ్చెనో తెలిసికొనుట సత్యవేద పారాయణులకు ప్రయోజనకరము. గనుక దానినిగూర్చిన చరిత్ర సంగ్రహముగా తెలిసికొందము. పరిశుద్ధ గ్రంథమును తెలుగులోనికి భాషాంతరము చేయు పని క్రీ॥శ॥ 1712 సంవత్సరములో మొదట ప్రారంభమయ్యెను. అనగా ఇప్పటికి సుమారుగా మూడు వందల సంవత్సరముల క్రితము ప్రారంభించబడినది.

1. **బర్తొలోమయి జీగిన్‌బాగ్** అను ఒక మిషనెరి దక్షిణ భారతదేశములోని ట్రాంకుబారునకు వచ్చెను. స్థానిక భాషలోనికి తర్జుమాచేయుట అవశ్యకమని ప్రోత్సహించబడినవాడై బైబిలును భారతీయ భాషలలోనికి తర్జుమా చేయుట క్రీ॥శ॥ 1712 సంవత్సరమున మొదలుపెట్టి, తెలుగు భాషలోనికి క్రొత్త నిబంధనను తర్జుమా చేయుట ప్రారంభించెను. కాని అతడు దానిని ముగించక పూర్వము అనగా క్రీ॥శ॥ 1719 సంవత్సరమున చనిపోయెను.

2. జీగిన్‌బాగ్ ప్రారంభించిన పనిని **షుల్జ్** అను మరియొక మిషనెరి క్రీ॥శ॥ 1719 సంవత్సరమునుండి కొనసాగించెను. ఇతడు జర్మనీ దేశస్థుడైనను అనేక భాషలు నేర్చిన పండితుడు. అందుచేత ప్రభువు నేర్పిన ప్రార్ధనను ఇతడు ఎనిమిది భాషలలోనికి తర్జుమాచేసి దానిని తాటాకు పత్రములమీద వ్రాయించి ప్రజలకు పంచిపెట్టెను. షుల్జ్ తెలుగులోనికి బైబిలును తర్జుమాచేయుటకు ప్రయాసపడుటయే గాక హిందీలోనికి, తమిళములోనికి తర్జుమా చేయుటకు పాటుపడెను.

   క్రీ॥శ॥ 1732 నాటికి **షుల్జ్** పాత నిబంధనను కూడా తర్జుమాచేసి ఆ వ్రాత ప్రతిని జర్మనీలోని తన సొంత విశ్వవిద్యాలయమునకు పంపి దానిని పుస్తక భాండాగారములో ఉంచవలెనని కోరెను. జర్మనీ దేశమందలి 'హాలి'లోని విశ్వవిద్యాలయమున అది భద్రముగా ఉండుననియు, తనకు వీలుకలిగినప్పుడు దానిని అచ్చువేయించ వచ్చునుగదా అని అతడు తలంచెను. కాని విశ్వవిద్యాలయమువారికి ఆ వ్రాత ప్రతియొక్క ప్రాముఖ్యత తెలియనందున దానిని ఎచ్చటనో అశ్రద్ధగా పెట్టిరి. తరువాత కొంతకాలమునకు వారు దానిని వెదకిరిగాని అది ఎవరికిని దొరకలేదు. ఇట్లు అనేకులు పరిశుద్ధ గ్రంథమును తెలుగులోనికి తర్జుమాచేయు విషయంలో నిష్ఫలులైరిగాని వారి తర్వాత మరికొందరిని ప్రభువు ప్రేరేపించగా వారు ఆ పనిని కొనసాగించుచుండిరి. ప్రయత్నములు మాత్రము మానరైరి.

3. క్రీ॥శ॥ 1795 లో ఈస్టిండియా కంపెనీ ఉద్యోగులలో ఒకరైన **కెప్టెన్ డాడ్సు** అనునతడు ఆత్మచే ప్రేరేపించబడినవాడై తన విశ్రాంతి కాలములో బైబిలును తర్జుమాచేయుటకు మొదలు పెట్టి క్రొత్త నిబంధనలో కొంత భాగమును తెలుగులోనికి తర్జుమాచేసెను. అతడు సెలవుమీద ఇంగ్లాండుకు వెళ్ళవలసిన కాలము వచ్చినప్పుడు తన సమయమును ఈ మంచి పనికై వినియోగించుటకు నిశ్చయించుకొని, తన రాకకొరకు ఎదురుచూచుచున్న తల్లికి ఇట్లు ఉత్తరము వ్రాసెను : "ప్రియమైన అమ్మకు, నాకు సెలవు దినములు వచ్చినవి గాని నేను త్వరగా నీ యొద్దకు వచ్చుటలేదు. కారణమేమనగా, భారతదేశ సహోదరుల ప్రయోజనార్థము నేను ఇప్పుడు నా సెలవు కాలమును పరిశుద్ధ లేఖనములను భాషాంతరము చేయుటలో గడుపుచున్నాను. ఇది నీకునూ ఎంతో సంతోషముగదా! నేను వెంటనే నీయొద్దకు రాక భారతదేశములోనే ఉండి ఈ మంచి పని చేయుచున్నాను. నా విషయమై నీకు తృప్తి కలుగునని నేను తలంచుచున్నాను.

   పరిశుద్ధ లేఖనములను నేను రెండు భాషలలోనికి తర్జుమా చేయుచున్నాను. భారతదేశమునకు వచ్చినప్పటినుండి నేను ఈ భాషను, మలబారు భాషను నేర్చుకొని యున్నాను. వీటిని నేర్చుకొనుటవలన లోకసంబంధమైన మేలేదైన దొరకునని నేనట్లు చేసియుండలేదు గాని నా రక్షకుడు మానవులందరి రక్షకుడని ఎరుగని ప్రజలకు ఆయనను గూర్చిన జ్ఞానము శక్తికొలది వ్యాపింపజేసిన వారిలో నొకడను కావలెనను ఆశతో ఈ పనికి పూనుకొనుట కొందరికి చిత్రముగా తోచవచ్చును. నన్ను వెఱ్ఱివానిగా భావించవచ్చును. కాని నీకయితే, ఇంత మంచి పని చేయుచున్నందున నీ యొద్దకు వచ్చుటలో కొంత ఆలస్యము చేసినను సమ్మతమేయని తలంచుచున్నాను. అంతేగాక నేను ఈ పనిని పూర్తిచేయగలిగిన యెడల వెంటనే నీయొద్దకు వచ్చినదానికన్న ఆలస్యముగా వచ్చుటచే పదిరెట్లు తృప్తికలుగును. ఎందుచేతనంటే, నేను జీవించిన కాలములో కొంత మంచి పని చేసితినిగదాయను తృప్తి నాకుండును. అంతేగాక నా రక్షకునిగూర్చిన సువార్తను ప్రకటించుటలో నాకుండిన ఆసక్తి విషయమై ఒక శాశ్వతమైన జ్ఞాపకార్ధ చిహ్నమును నా తరువాత తరమువారి కొరకు గడించినవాడనగుదును. నేను ఇప్పటికి చాలా పుస్తములు తర్జుమాచేసితిని. మరియొక సంవత్సరములోపు మిగిలినవాటిని ముగించగలను. మరియు నేను భారతదేశమునకు బయలుదేరినప్పుడు, మహిమగల సువార్త ప్రకాశమును భారత ప్రజలకిచ్చుటకే దేవుడు నిర్ణయించెనని, నా మేనమామ చెప్పెను. ఆ మాట నెరవేర్చుటకు నేను ప్రయాసపడుచున్నాను. నా విషయమై యింత గొప్పగ నేను చెప్పుకొనుట నాకు తగదేమో, అయినను నా ప్రియమైన తల్లీ, నేను తలపెట్టుకొనిన ఈ కార్యము నెరవేర్చగలుగునట్లు నా కొరకు ప్రార్ధించుము. ఈ లోకములో నాకు దీనికిమించిన పని వేరొకటి లేదు. ఈ కార్యమును తుదముట్టించుటలో నాకేమి సంభవించినను నేను లెక్కచేయను".

   ఈ ఉత్తరమును వ్రాసిన యొక వారమునకు కెప్టెన్ డాడ్సు మరిణించెను. గనుక అతని తల్లి తన కుమారుని చూడనేలేదు సరిగదా, అతడు చేసిన పనియు నిష్ఫలమాయెను. ఎట్లనగా, అతని సహ ఉద్యోగులు డాడ్సు చేసిన పనియొక్క విలువను ఎరిగినవారు కారు. అందుచేత బైబిలు తర్జుమా యొక్క వ్రాత ప్రతినిగూర్చి శ్రద్ధలేక దానిని ఎక్కడనో పెట్టిరి. డాడ్సును, అతని తల్లియు బైబిలు తర్జుమా కొరకు ఎంత త్యాగముచేసిరో వారికి గ్రాహ్యముకాలేదు. ఆ వ్రాత ప్రతిని ఒక చిత్తుకాగితముల కట్టగా భావించిరి. దానిని వారు కొంతకాలమైన తరువాత తగులబెట్టిరి.

   తెలుగు బైబిలుకొరకు డాడ్సు సిద్ధముచేసిన ఆంధ్రానువాదము ఇప్పటికాలమున మనము ఉపయోగించదగినది కాకపోయినను, దానిని సిద్ధముచేయుటలో అతని భక్తిశ్రద్ధలు, అతడు చేసిన త్యాగములు కొనియాడతగినవి. డాడ్సువలె బైబిలు అనువాదకులనేకుల వ్యయ ప్రయాసలు వృధాయాయెను. గాని దేవుడు తన పనిని తుదముట్టించెను. కావున బైబిలుగాని దాని భాగములలో కొన్నిగాని ప్రస్తుతము కొన్ని వేల భాషలలోనికి తర్జుమాచేయబడియున్నవి. వీటిని సిద్ధముచేసినవారి సేవ ఎంత విలువగలదో డాడ్సు చరిత్ర వలన మనము గ్రహించగలము.

4. తరువాత కాలములో తెలుగులోనికి బైబిలును అనువదించినవారిలో ముఖ్యులు విలియం కేరి, మార్షమన్, వార్డు అనువారు. వీరిని సిరంపూరు త్రిమూర్తులందరురు. క్రీ॥శ॥ 1805 లో వీరు క్రొత్త నిబంధనను తర్జుమాచేయ ప్రారంభించి ఆరు సంవత్సరములలో దానిని ముగించిరి. అంతయు సిద్ధమైన తరువాత క్రీ॥శ॥ 1812 లో అచ్చువేయు ముద్రాక్షరశాలకు నిప్పంటుకొని, ముద్రించబడిన కాగితములు, విలువైన వ్రాతప్రతులు, అచ్చులు కాలిపోయెను. కనుక వారు మరలా అనువాద పనిని ప్రారంభించి తర్వాత ఆరేండ్లలో అనగా **1818 సంవత్సరమున క్రొత్త నిబంధనను తెలుగులో అచ్చువేసిరి.** ఆ తరువాత మూడేండ్లకు పాత నిబంధనలోని పంచకాండములను భాగము తెలుగులో ముద్రించబడెను.

5. ఇంతలో లండను మిషనుకు జెందిన యిరువురు మిషనెరీలు విశాఖపట్టణమునకు వచ్చిరి. వీరు బైబిలును ఆంధ్రీకరించుటకు ప్రయాసడిరి. 1804లో బ్రిటీష్ అండ్ ఫారిన్ బైబిలు సొసైటీ స్థాపితమయ్యెను. ఆ సంవత్సరమే ఈ ఇద్దరు మిషనెరీలు ఇండియాకు వచ్చిరి. వారెవరనగా **జార్జిక్రాన్, అగస్టిన్ డిగ్రాంగ్** అనువారు. వీరు భారతదేశములోని విశాఖపట్టణమునకు చేరగానే బైబిలును తెలుగులోనికి అనువదించ మొదలుపెట్టిరి. బైబిలును ప్రజల సొంతభాషలో వారికి పంచిపెట్టిన యెడల ఎంతబాగుండును? కాని అది చాల వ్యయప్రయాసలతో కూడినది. అయినను దినదినము కొంత ప్రయాసపడెదమని చెప్పివారు ఈ పనికి పూనుకొనిరి. డిగ్రాంగు అట్లే తన మిత్రులకు వ్రాసెను. ఇట్లు వ్రాసిన నాలుగు సంవత్సరములకు అనగా, 1809 లో అతడు మరణించెను. డిగ్రాంగు ఆ పనిని కొనసాగించుటలో **ఆనంద రాయర్** అను నొకని సహాయమును తీసికొనెను. ఈ ఆనంద రాయర్ బ్రాహ్మణుల నుండి క్రైస్తవుడాయెను. వీరిరువును రెండేండ్లలో క్రొత్త నిబంధనలో పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక ఆఖరివరకు తెలుగులోనికి అనువదించిరి. డిగ్రాంగు మిషనెరీ గ్రీకు భాషలోనుండియు, ఆనందరాయర్ తమిళములోనుండియు తెలుగులోనికి అనువాదముచేసి, వారిరువురు చేసిన పనిని సరిచూచుకొనుచు పనిచేసిరి. 1810 సంవత్సరము జూన్ నెలలో డిగ్రాంగు ఇట్లు వ్రాసెను. "దేవుని వాక్యమును యథార్థముగ తెలుగులోనికి భాషాంతరము చేయుట ఆవశ్యకము. కావున మెషనెరీలు తక్కిన పనులన్నిటి కన్న బైబిలు భాషాంతరమునకు ప్రాధాన్యత నియ్యవలెను. ఈ పని ప్రారంభమైనందువలన నాకు చాలా సంతోషము". ఇట్లు వ్రాసిన మరుసటి నెలలోనే ఈ మిషనెరీ కాలముచేసెను. కాని తన తదనంతరము ఆ పని కొనసాగింపబడునను నిరీక్షణతోనే అతడు మరణించెను. జూలై 12వ తేదీన మరణించుచు ఈ చివరి మాటలు పలికెను. "భాషాంతరము చేయుటకే నేను బ్రతికియుండనక్కరలేదు. నేను లేకపోయినప్పటికిని ప్రభువు ఈ పనిని కొనసాగించును". అతడన్నట్లుగా 1812లో మత్తయి, మార్కు యోహాను సువార్తలు తెలుగులో ప్రచురించబడెను.

   క్రీ॥శ॥ 1812లో **ప్రిట్‌చెట్** విశాఖపట్టణమునకు వచ్చెను. అతడు ఆనందరాయర్, జాన్ గోర్డనుల సహాయముతో క్రొత్త నిబంధన భాషాంతరము పూర్తిచేసెను. **ఇట్లు మొదటి తెలుగు క్రొత్త నిబంధన 1818 లో మద్రాసునందు ముద్రింపబడెను.** దాని ప్రతియొకటి ఇప్పుడు సికింద్రాబాదు సహాయ సంఘ పుస్తక భాండాగారములో ఉన్నది. అప్పటి తెలుగు భాషకును ఇప్పటి తెలుగు భాషకును చాలా తేడాయున్నది. ప్రిట్‌చెట్ 1824లోను, గోర్డను 1828లోను మరణించిరి. వీరిరువురును పాత నిబంధన గ్రంథమును భాషాంతరము చేయుటలో తోడ్పడిరి. 1831 లో బైబిలులోని మొదటి పుస్తకమైన ఆదికాండము తెలుగులో మద్రాసునందు ముద్రింపబడెను. దాని తర్వాత కీర్తనల గ్రంథము ప్రచురింపబడెను. ఈ రెండు పుస్తకములును 'ఆథరైజ్డ్ వర్షన్' అను ఇంగ్లీషు బైబిలునుండి భాషాంతరము చేయబడెను.

6. బళ్లారిలో పనిచేయుచుండిన **రీడ్** అను మరియొక లండను మిషనెరీ ఆదికాండము, నిర్గమకాండము, కీర్తనలు సువార్తలు భాషాంతరము చేసెను మద్రాసు సహాయ సంఘమువారు 1841లో ఆదికాండమును ముద్రించిరి. రీడ్ జీవించిన కాలమందే కీర్తనల గ్రంథము, సువార్తలు ప్రచురించబడెను. నిర్గమకాండము జాగ్రత్తగా సరిచూడబడి దానిలో కొన్ని మార్పులు చేయబడెను. తరువాత మద్రాసు సహాయ సంఘపు అనుమతితో **వాడ్లా** యను మరియొక మిషనెరీ దానిని అచ్చు వేయించెను.

7. మద్రాసులోని అమెరికా మిషనెరీలు కూడ **న్యూవెల్** అను మిషనెరీ సహాయముతో క్రొత్త నిబంధన గ్రంథమును భాషాంతరము చేసిరి. వారు సుమారు 1844లో సువార్తలను, అపొస్తలుల కార్యములను, రోమీయులకు పౌలు వ్రాసిన పత్రికను ప్రచురించిరి. ఆ కాలమందే మద్రాసులో ఈ పనియందు ఆసక్తిగల మరికొందరు సంఖ్యాకాండమును, ద్వితీయోపదేశకాండమును, దినవృత్తాంతములను భాషాంతరముచేసి ప్రచురించిరి.

8. మిషనెరీలు మాత్రమేగాక, మిషనేతర ఉద్యోగములలోనున్నవారును బైబిలు భాషాంతరము విషయము పాటుపడిరని చూచితిమిగదా! మద్రాసు సివిల్ సర్వీసులో నుండిన **సి.పి. బ్రౌన్** బైబిలును సొంతముగ తెలుగులోనికి భాషాంతరము చేయుటలో పాటుపడెను. అతడు సిద్ధముచేసిన లూకా సువార్త 1838 లో ప్రచురించబడెను. 1855 సంవత్సరములో మరికొన్ని భాగములు ముద్రింపబడెను. ఆ సంవత్సరమందే ఆయన భాషాంతరము చేసిన తెలుగు బైబిలు ప్రచురింపబడియుండవచ్చును. బ్రౌన్ దొర గొప్ప పండితుడు. అతడు తెలుగు – ఇంగ్లీషు, ఇంగ్లీషు – తెలుగు నిఘంటువులను సిద్ధముచేసెను. అవి ఇప్పటికిని వాడుకలో ఉన్నవి. బ్రౌన్ దొర సిద్ధముచేసిన తెలుగు బైబిలు ప్రతియొకటి లండను బైబిలు గృహములో నున్నది.

9. అప్పటివరకు వాడుకలోనున్న భాషాంతరములను సరిచేసి ఒకే కూర్పును సిద్ధము చేయుటకు 1844 లో ఒక ఉపసభ ఏర్పాటు చేయబడెను. వారప్పటికి తయారైన వ్రాత ప్రతులను సరిచూచి అందరి ఆమోదమును పొందగలిగిన ఒక తెలుగు బైబిలును సిద్ధముచేసి **1857 లో పాత నిబంధన గ్రంథమును ముద్రించిరి.** ఈ పనిలో ముఖ్యముగ ప్రయాసపడివారు లండను మిసనెరీ సొసైటీకి చెందిన మిషనెరీలు. వారిలో ముఖ్యులు **ఆర్.డి. జాన్‌స్టన్, జె. గోర్డను** అనువారు. ఈ కమిటీ క్రొత్త నిబంధన విషయములో కొంత తర్కించిరి. గ్రీకులోని మూలగ్రంథమునే పాఠాంతరముగా వాడవలెనను దానిగూర్చి అభిప్రాయభేదము కలిగెను గాని లండను వారొక పాఠాంతరము నిచ్చిరి. దాని ననుసరించి క్రొత్త నిబంధనను భాషాంతరము చేసిరి. **ఇట్లు సిద్ధము చేయబడిన బైబిలు 1860 సంవత్సరమున ముద్రింపబడెను. ఇదియే పూర్తి తెలుగు బైబిలు.** 1857 సంవత్సరమునకు పూర్వము ముద్రింపబడిన క్రొత్త నిబంధనయు, 1857 సంవత్సరమున ముద్రింపబడిన పాత నిబంధనయు ఇందు ఇమిడియున్నవి.

10. 1865 లో మద్రాసు సహాయ సంఘమువారొక కమిటీని నియమించిరి. వారు అప్పటికే తెలుగు బైబిలును సవరించుచుండిన **జాన్ హే** గారితో కలిసి పనిచేయవలెనని కోరిరి. 1873 సంవత్సరము వరకు ఏ పనియు జరగలేదు. 1874 సంవత్సరమున హే గారు కొన్ని సూత్రములను సిద్ధము చేయగా వాటినిబట్టి 1860 సంవత్సరపు బైబిలును సవరించిరి. 1882 సంవత్సరమున లండను మిషనెరీ సొసైటీ మిషనెరీయైన హే గారు పూర్తిగా ఈ పని కొరకు నిమమింపబడెను. 1884 సంవత్సరమున సరిచూడబడిన తెలుగు బైబిలు ప్రచురింపబడెను.

11. 1881 సంవత్సరమున **బాప్టిస్టువారు** క్రొత్త నిబంధనకు తమ సొంత కూర్పును సిద్ధముచేసి ప్రచురించిరి. ఇది ఒక తాత్కాలిక కూర్పుగామాత్రమే యుండెను.

12. సవరణ కమిటీవారు తెలుగు బైబిలును మరల సవరించ మొదలుపెట్టి తుదకు 1904 లో దానిని

ముద్రించిరి. ఈ సవరనలో పాలుపంచుకొన్న భారతీయులు. **డి. అనంతం గారు (కానన్), వి. సిన్నయ్య** అనువారు. మిషనెరీలు ఇ. లూయిస్. లూయిన్ అకాల మరణమునొందగా ఆయన స్థానమున **జె.ఆర్. జాకబ్** పని చేసిరి.

13. మద్రాసు సహాయ సంఘపువారు క్రొత్త నిబంధన పాఠాంతరములోని మార్పును గూర్చి లండను బైబిలు సొసైటీ శతవార్షికోత్సవ సంవత్సరమైన 1904 లో ఒక ముఖ్యమైన తీర్మానము చేసిరి. 1881 సంవత్సరమునుండి క్రొత్త నిబంధనలో రెండు కూర్పులుండెను. ఒక దానిని అమెరికా బాప్టిస్టు కనేడియను బాప్టిస్టు మిషనుల వారును, మరియొకదానిని మద్రాసు సహాయ సంఘపువారును ప్రచురించిరి. బాప్టిస్టు కూర్పులో 'బాప్తిస్మము' అనుపదమును 'ముంచడము' అనియు, మద్రాసు సహాయ సంఘపు కూర్పులో ఆ పదమునే 'స్నానము' అనియు భాషాంతరము చేసిరి. బాప్తిస్మము అను పదమునకు సరియైన భాషాంతరమునుగూర్చి చాలా కాలమునుండి జరుగుచుండిన ఈ సంవాదము 1904, జనవరి 25వ తేదీన జరిగిన మద్రాసు సహాయ సంఘ ఉప సభయందు తుదముట్టెను. ఆ సభయందు ఈ విధముగా తీర్మానించిరి. గ్రీకు పదమగు 'బాప్టిజో' యును అందుకు సంబంధించిన పదములును తర్జుమా చేయక క్రొత్త నిబంధన పాఠాంతరమందు ఆ పదములనే తెలుగులో వ్రాయుచు, 'బాప్తిస్మము' అను పదముకు మార్జినులో 'లేక ముంచడము' అని వ్రాయవలెననియు, బాప్తిస్మముకు సంబంధించిన సందర్భములలో ఇంగ్లీషు రివైజ్డ్ పాఠాంతరమును దాని మార్జినులోని విషయములతో సహా తెలుగులోనికి భాషాంతరము చేయవలెననియు తీర్మానించిరి. అప్పటినుండి క్రొత్త నిబంధనకు ఒకే కూర్పు ఉంటూయున్నది.
14. 1904 సంవత్సరమున ప్రచురింపబడిన తెలుగు బైబిలునుగూర్చి విమర్శలు, అభిప్రాయములు పంపవలసినదిగా సంఘ నాయకులకు తెలుపబడెను. వారు పంపిన విమర్శలను, అభిప్రాయములను కమిటీవారు 1911 సంవత్సరమున కూడి ఆలోచించి, సవరించి ప్రచురించిరి. ఈ కూర్పు మొత్తముమీద అన్ని సంఘముల ఆమోదమును పొందెను. అటుతర్వాత సవరణలేమియు జరుగలేదు గాని వేరు వేరు కూర్పులు ప్రచురింపడెను.
15. 1913, 1914 సంవత్సరములలో పశ్చి గోదావరి జిల్లా ఏలూరు సమీపమున నున్న లక్కవరము జమీందారు, **రాజా భుజంగరావు** క్రొత్త నిబంధనలోని సువార్తలు, రోమా, గలతీయ పత్రికలను పద్యకావ్య రూపమున భాషాంతరము చేయుట 1913 లో ప్రారంభించి 1923 సంవత్సరమున పూర్తిచేసిరి. దానిని **"నవ నిబంధన"** అను పేరుతో 1924 సంవత్సరమున ప్రచురించిరి.
16. 1941 లో **డబ్ల్యూ. బాగ్స్** గారిచే సిద్ధము చేయబడిన రెఫరెన్స్ బైబిలు ప్రచురింపబడెను. అదివరలో క్రొత్త నిబంధనమాత్రం రెఫరెన్సులతో ముద్రింపబడెను.
17. తెలుగు బైబిలు మొత్తముమీద ఆదిమ హెబ్రీ, గ్రీకు భాషలలో నుండి భాషాంతరము చేయబడినందున దోషరహితముగానున్నది. కాని అక్కడక్కడ కొన్ని మార్పులు అవసరమని ఆంధ్ర క్రైస్తవ సభవారును, హైదరాబాదు క్రైస్తవ సభవారును ఆలోచించి యొక ఉపసభను నిర్ణయించగా, వారు తెలుగు ప్రాంతమున పనిచేయుచున్న మిషనులయొక్కయు, సంఘములయొక్కయు ప్రతినిధులను సమకూర్చి ఆలోచించిరి. తెలుగు బైబిలును పూర్తిగ పునర్విమర్శ చేయనక్కరలేదని వారు తీర్మానించిరి. మద్రాసు సహాయ సంఘము యొక్క ఆధిపత్యమున సవరణ కమిటీ యొకటి ఏర్పడి, భాషాదోషములను దిద్ది, కఠినమైన పదములను సులభ పరచిరి. ఇట్లు సరిచేయబడిన కూర్పు **1953 సంవత్సరమున అచ్చువేయబడెను. అదియే ఇప్పుడు వాడుకలోనున్నది.**
18. 1920 – 1923 సంవత్సరములలో బైబిళ్లు చాలా కరవుగా ఉండెను. ఒక మిషనెరీ ఇట్లు వ్రాసెను. తన బావమరిది తనయొద్ద తెలుగు క్రొత్త నిబంధనను అరువు తీసికొని, ముద్రించబడిన మరియొక ప్రతి దొరకనందున దానిని ఎత్తి వ్రాసెను. 1929 సంవత్సరములో ఒక్క ప్రతి సువార్తయైనను దొరకలేదని మరియొక మిషనరీ వ్రాసెను. 1952 సంవత్సరములో క్రొత్త నిబంధన ప్రతులేమియు మద్రాసులో లేకుండెను. అట్టి కరవు మనకిప్పుడు లేనందుకు దేవునికి స్తోత్రము.

తెలుగు బైబిలును మనము కొనగలిగిన స్వల్ప ఖరీదుకు, మనకు ముద్రించి ఇచ్చుచున్న బైబిలు సొసైటీ వారికి నీవేమి చెల్లించగలవు? దాని కొరకు ప్రార్థించగలవు. ప్రతివారికి బైబిలు దొరుకునట్లు చందా యివ్వగలవు. నీకు లభించిన బైబిలును చదువగలవు. దానిని ధ్యానించగలవు. బైబిలు ప్రకారము జీవించగలవు.

*– బైబిల్ సమాచారమ్ 135–143 పేజీలనుండి సేకరించడమైనది. ఎడిటర్*

# యషువ మెస్సీయ రాకడ

**– బ్రదర్. పి. రాజు**

ఈనాడు సర్వసృష్టి యషువ మెస్సీయ యొక్క ప్రత్యక్షత కొరకు కనిపెట్టుచున్నది. ప్రపంచమంతట అనేకచోట్ల అనేకమంది యషువ మెస్సీయ రాకడ గురించి ప్రకటిస్తున్నారు. రాకడ మహా సభలంటూ ఆర్భాటాలు చేసేస్తున్నారు. పరిశుద్ధ గ్రంథంలోని లేఖనములకు తప్పుడు అర్థాలు తీస్తూ దానియేలు, ప్రకటన పుస్తకములపై తప్పుడు వ్యాఖ్యానాలు చేస్తూ ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారు. లేఖనముల యొక్క సారాంశము అర్థం గాకపోయినా సరే ఎవరికి తోచిన విధంగా వారు ప్రకటిస్తున్నారు. ఎంతోమంది దానియేలు, ప్రకటన పుస్తకములపై ఎన్నో గ్రంథాలు రాసేసారు. ఆయా ప్రవక్తల ద్వారా ప్రకటింపబడిన కాలములను అర్థం గాక ఎవరి ఆలోచనలకు తట్టిన డేట్లు ప్రకటించి ఆ డేట్లలో యషువ మెస్సీయ రాకడ ఉంటుందని ప్రకటిస్తున్నారు. ఈ ప్రకటించే వాళ్ళందరూ అబద్ధ ప్రవక్తలే. సర్వశక్తిమంతుడైన యావె, ఆయా కాలాలలో మనుష్యులకు సంభవించే సంగతులను ఒక మనుష్యుని ద్వారా ముందుగానే వారికి తెలియజేసేవాడు. అతనినే "ప్రవక్త" అని పిలవడం జరిగింది. ఒక ప్రవక్త ప్రవచించాడంటే అది ఖచ్చితంగా జరిగేది. ఒక మనుష్యుడు చెప్పిన మాట జరగలేదంటే అతను ప్రవక్తకాడు. అబద్ధ ప్రవక్త. ప్రవక్త "యావె మాట మాత్రమే ప్రకటిస్తాడు. అబద్ధ ప్రవక్త తన సొంత మాటలను ప్రకటిస్తాడు. అదే తేడా ఇద్దరికి. (ద్వితీ 18:21,22) నిజమైన ప్రవక్తలు, అబద్ధ ప్రవక్తలు పితరులయుగం నుండి లోకంలో ఉన్నారు. ఉదాహరణకు ఇశ్రాయేలు రాజైన ఆహాబు కాలంలో మీకాయ నిజప్రవక్త, సిద్కియాతో సహా నాలుగు వందల మంది అబద్ధ ప్రవక్తలు ఉన్నారు. ప్రవక్తలు ద్వారా పలుకబడిన మాట ఖచ్చితంగా నెరవేరేది. రాజైన ఆహాబు కాలంలో సిరియారాజైన బెన్హదదు విస్తారమైన సైన్యముతో అహాబు మీదకు దండెత్తి రాగా అప్పుడు ఒక ప్రవక్త ద్వారా యావె సెలవిచ్చిన రీతిగా అహాబు యుద్ధంలో గెలుపొందడం జరిగింది. అప్పుడు ఆ ప్రవక్త రాజైన అహాబుతో ఖచ్చితంగా సిరియా రాజు సంవత్సరం తర్వాత నీమీదకు యుద్ధానికి వస్తాడు అని చెప్పగా ఖచ్చితంగా సంవత్సరం తర్వాతే సిరియా రాజు అహాబు మీదకు దండెత్తి రావడం జరిగింది. అదీ ప్రవక్త మాటంటే. ఇలాంటి ఎన్నో ఉదాహరణలు పరిశుద్ధ గ్రంథంలో ఉన్నాయి. ఇక అబద్ధ ప్రవక్తల సంగతి చూచినట్లయితే వీళ్ళు ప్రకటించేది జరుగదు. ఎందుకంటే వీరి ద్వారా యావె పలుకలేదు. కాబట్టి. అయినా వీరు బరి తెగించి ప్రకటించేస్తారు. ఇలాంటి అబద్ధ ప్రవక్తలు అనేకమంది యషువ మెస్సీయ రాకడ ముందు వస్తారని వీరు అనేక మందిని మోసపరుస్తారని లేఖనముల ద్వారా తెలుస్తున్నది (మత్తయి 24:11) ఈ అబద్ధ ప్రవక్తలు ప్రకటించిన విషయాలు నమ్మి జనాలు కనిపెడుతున్నారు. కాని ఆవిధంగా జరుగుటలేదు. "పలనా సంవత్సరంలో మెస్సీయ రానై యున్నాడు" అని చాలా తేలిగ్గా చెప్పేస్తున్నారు. అవి నమ్మిన కొందరు ప్రజలు ఆస్తులు అమ్ముకొని ఆశ్రమాలకు పోతున్నారు. కొంతమంది రాకడ గురించి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడతున్నారు. గడిచిన మేనెలలో 36 మంది రష్యన్లు ప్రపంచం అంతమైపోతున్నాదని ఒక ఇంటిలో కూడుకొని ప్రార్ధనలు చేసిన సంగతి దినపత్రికలో చదవడం జరిగింది. ఇంకొంతమంది అయితే ఎలాగు చచ్చిపోతాం కాబట్టి బ్రతికి ఉండగానే అన్ని అనుభవించాలనే ఉద్దేశ్యంతో త్రాగుతూ, తింటు కాలం గడిపేస్తున్నారు. ఇలా లోకం అంతా ఈ అబద్ధ ప్రవక్తల అబద్ధాల మూలంగా గందరగోళంలో పడిపోయింది. ఈ గందరగోళం ఈనాటిది కాదు. హిబ్రూ భాషలో రాయబడని పరిశుద్ధ గ్రంథం ప్రపంచంలోని అన్ని భాషలలోనికి తర్జుమా చేయబడిన తర్వాత ఆయా భాషలు మాట్లాడు ప్రజలు గ్రంధాన్ని చదవడం మొదలుపెట్టాక ఎవరి ఆలోచనలకు ఏమి తడితే వాటిని నిజమని నమ్మి వాటిని ప్రకటించడం వాటిని పుస్తకముల రూపంలో రాయడం జరిగింది. ముఖ్యంగా దానియేలు, ప్రకటన గంధాలపై ఎన్నో వ్యాఖ్యానాలు వచ్చాయి. వాటిని చదవి నమ్మేస్తున్నారు కొంతమంది అమాయకలు. దానియేలు గ్రంథం మర్మాలు, ప్రకటన గ్రంథం మర్మాలు అంటే జనాలు ఎక్కడికైనా పరుగెత్తుతున్నారు. కాని ఆ విషయము ఎంత వరకు వాస్తవం అని ఎవరూ పరిశీలించడంలేదు. అవి నిజంగా పరమతండ్రి ద్వారా పలుకబడిన మాటలేనా అని పరిశోధించుట లేదు.

ఇటీవల నాకొక పుస్తకం దొరికింది. దాని పేరు "18 అంత్యశాల బైబిల్ ప్రవచనములు". ఆ పుస్త రచయిత లారీ విల్సన్. ఆ పుస్తకంలో ప్రకటన గ్రంథంలో 5:7లో చెప్పబడిన నాల్గువ ముద్ర మరియు 11:3లో రాయబడిన పరిచర్య ప్రారంభం 1994 సం॥రంలో జరుగుతాయని ఏడు బూరలు ఊదబడుట కూడా 1994 సం॥లోనే ప్రారంభమవుతాయని ప్రకటన 13:5 ప్రవచన నెరవేర్పు 1995 సం॥లో జరుగుతుంది. 1996లో ఐదవ ముద్ర విప్పబడుతుందని 1997లో ఇద్దరు సాక్షులు చంపబడతారని దానియేలు ద్వారా తెలుపబడిన 1335 రోజులు 1998 సం॥ నాటికి పూర్తవుతాయని 1998 సం॥రం నాటికి 6000 సం॥రాలు పూర్తయి రెండవ రాకడ వస్తుందని రాయడం జరిగింది. 2008 అయినా ఆయన రాకడ లేదు మరి? అదేవిధంగా ప్రపంచములో చాలామంది 2000 సం॥రాల నాటి 6000 సం॥రాలు పూర్తయిపోతాయని 1000 సం॥రాల పరిపాలన మొదలవుతుందని ఎంతో ఆత్రుతగా ఎదరు చూసారు. అదీ జరగలేదు.

మా ఏరియాలో ఒకాయన ఇండియాకు నేనే నాయకుడనని, ఇండియాలోని విశ్వాసులు యషువ మెస్సీయను చేరాలంటే నేనే మార్గమని అనేవాడు. అంతా నిజమని మేము నమ్మి ఆయనను వెంబడించడం జరిగింది. ఆయన 2004 కల్లా అంతా ముగిసిపోతుంది, ఆయన రాకడ వస్తుందని చెప్పడం జరిగింది. దీంతో అందరూ ఆనాటికి తమదగ్గర ఉన్న ఆస్తులు అమ్ముకొని తమకున్న సమస్తం చేతపట్టుకుని ఆశ్రమానికి వచ్చేయాలని, అక్కడ యషువ మెస్సీయ నామ జపం చేయాలని పుకార్లు లేవదీశారు. ఈ నాయకుడు మాత్రం అందిన కాడికి అందినట్లు పోగేసుకోవడం, విశ్వాసుల ఇండ్లు, పొలాలు తనపేరు రాయించుకోవడం, అమ్మాయిలకు మాయమాటలు చెప్పి లోబరుచుకోవడం ఆ తర్వాత ఆ అమ్మాయిల్ని తన దగ్గర ఉండే శిష్యులకు ఇచ్చి పెండ్లి చేయడం, ఎవరైనా ఎదిరస్తే వారిని కొట్టించడం, పోలీస్ కేసులు పెట్టడం మొదలైన పనులన్నీ చేస్తూ ఉండేవాడు. ఆయన వద్ద పెద్దలలో ఒకాయన తనకు భూమి అంతా తగలబడిపోతున్నట్లు దర్శనాలు వస్తున్నాయని, 2004లో నిజంగా అంతం వచ్చేస్తుందని నాకు చెప్పాడు. ఇప్పుడు 2008 సం॥రం జరుగుతున్నది.

అదేవిధంగా మలాకీ 4:5 చెప్పబడిన ఏలీయా ప్రపంచ ప్రసిద్ధి చెందిన విలియం మారియన్ బ్రెన్‌హాం అని చాలామంది నమ్ముతున్నారు. లేఖనముల ప్రకారము ఏలియా అని చాలామంది నమ్ముతున్నారు. లేఖనముల ప్రకారము ఏలియా ఇశ్రాయేలీయుల వద్దకు పంపబడతాడని అర్థమవుతున్నది. మరి బ్రెన్‌హాం స్వయంగా తనను పరిశుద్ధాత్మ ఇశ్రాయేల్ వెళ్ళవద్దు అని చెప్పిందని ఒప్పుకొన్నాడు. మరి వీళ్ళెందుకు మలాకీ 4:5లో ఏలీయం బ్రెన్‌హాం అని నమ్ముతున్నారు? ఎందుకు ఇంతమంది ఇన్ని రకాలుగా ప్రకటిస్తున్నారు అని చూసినట్లయితే వీళ్ళందరూ కూడా ఎలోహీం అయిన యావె సెలవిచ్చిన మాట కాకుండా వీళ్ళ సొంతమాటలు; సొంత ఆలోచనలు ప్రకారం చెబుతున్నారు. ఈలాంటి వాళ్ళందరి చేత పలికించేది పరమతండ్రి కాదు. అబద్ధానికి జనకుడైన సాతాను. వీళ్ళు లోకాన్ని మోసగించడాన్కి మోసం చేసే ఆత్మను కల్గి ఉన్నవాళ్ళు.

అంతే కాకుండా దానియేలు, ప్రకటన గ్రంథాలలో వ్రాయబడిన కాలాలు, వ్యక్తులు, జంతువులు, సంఖ్యలు, మనుష్యుల విషయంలో ఎవరికి తోచిన రీతిలో వారు అర్థాలు చెబుతున్నారు. ఒక రచయిత 666 అనే సంఖ్య కంప్యూటర్ అని వ్రాశాడు. అది ఒక మనుష్యుని సంఖ్య అని లేఖనం చెబుతున్నది. ఇక కాలాలు విషయానికి వస్తే దానియేలు కాలంలో ఉన్న కేలండర్ వేరు. మనం అనుసరిస్తున్న కేలండర్ వేరు. ఉదాహరణకు పరమతండ్రి ఇచ్చిన కేలండర్‌లో మొదటి నెల పేరు నీసాను / అబీబు. ఇది మార్చి ఏప్రిల్ మధ్య కాలంలో ప్రారంభమవుతుంది. ప్రస్తుత కేలండర్‌లో సంవత్సరం జనవరి నెల నుండి ప్రారంభమవుతున్నది. నీసానుకు జనవరికి మధ్య దాదాపు 3 నెలలు వ్యత్యాసం ఉంది. పరమతండ్రి ఇచ్చిన కేలండర్ ప్రకారం దానియేలుకు ప్రకటించబడిన కాలాలను ఈ కేలండర్ ప్రకారం లెక్కగడితే ఎలా సరిపోతుంది?

యషువ మెస్సీయ రాకడ విషయం చూచినట్లయితే మెస్సీయ కన్యకగర్భాన పుడతాడని యెషయా ప్రవచించాడు. ఆయన రాకకోసం యూదులు ఎంతో ఎదరు చూశారు. చివరకు ఆయన కన్యయైన మరియ గర్భాన జన్మించాడు ఈయన జన్మవార్త విషయం కొద్దిమంది జ్ఞానులకు కొంతమంది గొఱ్ఱెల కాపరులకు తప్ప దూతలు ఎవరికీ ప్రకటించలేదు. రెండవసారి కూడ ఖచ్చితంగా ఇదే విధంగా జరుగుతుంది. పెండ్లి కుమారునిగా రాబోతున్న యషువ మెస్సీయ ఈ భూమి మీదనున్న పెండ్లికుమార్తెకు తన రాకడ సమయం తెలియజేస్తాడు. ఈ పెండ్లి కుమార్తె (వధువు) తన వరుని కొరకు సన్నని నార బట్టలు ధరించికొని తనను తాను సిద్ధపరచుకొనుచున్నది. ఈ నారబట్టలు పరిశుద్ధుల నీతిక్రియలు. ఈ వధువు ఇరుకు మార్గంగుండా ప్రయాణించి వరుడైన యషువ మెస్సీయను చేరుకోనున్నది.

పరమతండ్రియైన యావె మానవులకు సంభవించే భవిష్యత్ సంగతులను తనయందు భయభక్తులుగల వారికి తప్పనిసరిగా తెలియజేస్తాడు. "యావె మర్మము ఆయన యందు భయభక్తులు గల వారికి తెలిసియున్నది. "తన సేవకులైన ప్రవక్తలకు తాను సంకల్పించిన దానిని బయలు పరచకుండ ఎలోహింయైన యావె యేమియు చేయడు" (ఆమోసు 3:7) అని ఆమోసు ప్రకటిస్తున్నాడు. భూమిని బలాత్కారంతో నింపిన మానవ జాతిని నాశనం చేసేముందు ఈ విషయాన్ని నీతిమంతుడైన నోవహుకు తండ్రిముందే చెప్పడం జరిగింది. అలాగే పాపంతో నిండిపోయిన సొదమ, గొమొఱ్ఱాలను అగ్నితో కాల్చివేయకముందే ఈ విషయాన్ని భక్తుడైన అబ్రహాముకు చెప్పడం జరిగింది. అవన్నీ వాటి కాలాల్లో అవి ఖచ్చితంగా జరుగుతున్నాయి. భూకంపాలు, కరువులు, యుద్ధాలు, రాజ్యం మీదకు రాజ్యం జనం మీదకు జనం ప్రపంచమంతటా ఇవన్నీ జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో ఇండియాలో సంభవిస్తున్న బాంబు పేలుళ్ళు లేఖనములను ఋజువు పరుస్తున్నాయి. (మత్తయి 24వ అధ్యాయం). తన రాకడ సమయంలో లోకం పరిస్థితి నోవహు కాలంలో జలప్రళయమునకు ముందు పరిస్థితి వలె ఉంటుందని లోతు దినములలో ఉన్నట్లు ఉంటుందని యషువ మెస్సీయ చెప్పడం జరిగింది. ఆనాడు పాపములో మునిగి ఉన్న ప్రజలు జలప్రళయాన్ని పసిగట్టలేకపోయి ఆ ప్రళయంలో ఎలా కొట్టుకుపోయారో అదేవిధంగా యషువ మెస్సీయ రాకడ సమయంలో పాపంలో మునిగిపోయి ప్రజలు ఆయన రాకడను పసిగట్టలేక ఆయనతో పరలోకం వెళ్లే భాగ్యాన్ని కోల్పోతారు. ఆ తర్వాత అగ్నితో కాల్చివేయబడతారు. నోవహు, లోతులకు ఆయన ఏవిధంగా జరుగబోయే కీడును తెలియజేసాడో అదేవిధంగా ఆయన వచ్చే విషయం ఆ తరములోని నీతిమంతులకు ఖచ్చితంగా తెలియజేస్తాడు. "అప్పుడు మనుష్య కుమారుని సూచన.... పోగుజేయుదురు." (మత్తయి 24:31) ఈలోగా ఎంతో గందరగోళం జరుగుతుంది. ఎందరో అబద్ధ ప్రవక్తలు ఎన్నో అబద్ధాలు ప్రకటిస్తారు. మెస్సీయ ఇక్కడ ఉన్నాడు. అక్కడ ఉన్నాడు అంటారు. అన్ని అబద్ధాలే. కాని ప్రజలు మాత్రం అన్నీ నిజమని నమ్మి మోసపోతారు. నిరాశ పడతారు. కాలం కదిలేకొద్ది ఆయన రాకడపై ఆశ వదిలేసుకొంటారు.

ఇటీవల కాలంలో కంప్యూటర్లు కనిపెట్టబడిన తర్వాత అన్ని రంగాల్లో విపరీతమైన పరిణామాలు సంభవిస్తున్నాయి. వైజ్ఞానికపరంగా, వైద్యపరంగా ఎంతో అభివృద్ధి జరుగుతున్నది. దీనితో మురిసిపోతున్న మానవులు ఈ కంప్యూటర్ సహాయంతో భూమి మీద, ఆకాశంలో ఎన్నో పరిశోధనలు చేసి ఎన్నో విషయాలను వెలుగు తీసుకువస్తున్నారు. సృష్టికి ప్రతి సృష్టి చేసేయగలమని మనుషులకు ఇక ముసలితనమంటూ లేకుండా చేయగలమని, ఆదాం కాలంలో జీవించినట్లు మనుష్యులు వందలకొద్దీ సం॥రాలు బ్రతికేలా చేయవచ్చని అనుకొంటున్నారు. ఈ రకంగా మనుష్యులు తెలివిమీరిపోయి సృష్టికర్త మీద విశ్వాసముంచకుండ తమ తెలివితేటల మీద, శక్తియుక్తుల మీద విపరీతమైన నమ్మకం పెట్టుకుంటున్నారు. కొందరైతే ఇంకో అడుగు ముందుకేసి ఎలోహీం లేడంటున్నారు. రాబోయే కాలంలో "తండ్రి యందు విశ్వాసముంచడం" అనేది లోకంలో కనబడకపోవచ్చు. అందుకనే యషువ మెస్సీయ "మనుష్యకుమారుడు భూమి మీదవిశ్వాసం కనుగొనునా" అని సెలవివ్వడం జరిగింది. మరికొంతమంది యషువ మెస్సీయ రాకడను అపహాస్యం చేస్తూ ఈ సృష్టి ఆరంభమందు ఎలాగుందో ఇప్పుడును అలాగే ఉందని చెబుతారు. (2పేతురు 3:3,4) ఈ సృష్టి ఎప్పుడూ ఇలాగే ఉంటుంది కాబట్టి మనకేమి భయం లేదు అనుకొని నోవహు దినాలలో ఉన్నట్లు ఈ జనాలు తినుతూ, త్రాగుతూ, ఇండ్లుకట్టుకుంటూ, పెండ్లిచేసుకొంటూ తమకిష్టం వచ్చిన రీతిలో జీవిస్తూ ఉంటారు. వీళ్ళు ఇలా నెమ్మదిగా ఉన్న సమయంలోనే, మనకు భయమేమి లేదు అనుకొనే సమయంలో గర్భిణి స్త్రీకి ప్రసవ వేదన వచ్చినట్లు వీళ్ళకు ఆకస్మికంగా నాశనం వస్తుందని అపోస్తలుడైన సౌలు హెచ్చరించడం జరిగింది. (1థెస్స 5:1,4) ఈ ప్రజలు ఆయన రాకడకు సిద్ధంగా ఉండరు కాబట్టి ఆ నాశనం నుండి తప్పించుకోలేకపోతారు. ఎవరైతే బుద్ధిగల కన్యకల వలె సిద్ధపడి ఉంటారో వారే ఈ నాశనం నుండి తప్పించుకుంటారు.

లోకం ఆయన రాకడ కొరకు కనిపెడుతుంది కాని ఆయన వస్తే అంతా నాశనమే. "యావె దినము రావలెనని ఆశ పెట్టుకొని యున్నవారలారా మీకు శ్రమ;........... (ఆమోసు 5:18,19) ఆయనే మా రక్షకుడు ఆయనందు విశ్వాసముంచుతున్నాము అని అంటున్న ఈ క్రైస్తవులందరూ ఆయన వాక్యము ద్వారా సెలవిచ్చిన ప్రకారం మాత్రం వీళ్ళు చేయడంలేదు. సహోదరులారా క్రియలు లేని విశ్వాసం మృతం అని లేఖనం చెబుతున్నది. ఒక్కడే తండ్రి, ఒక్కటే వాక్యం, ఒక్కటే నిరీక్షణ, ఒక్కటే బాప్తిస్మం ఇది యావె మాట వేర్వేరు డినామినేషన్లు, వేర్వేరు సిద్ధాంతాలు, వేర్వేరు బాప్తీస్మాలు.... ఇది లోకం బాట. ప్రతీ క్రైస్తవుడు బాల్యంలో మొదటి దావీదు కీర్తనను బట్టీ పట్టేస్తారు. "యావె ధర్మశాస్త్రమందు ఆనందించుచూ దివారాత్రములు దానిని ధ్యానించువాడు ధన్యుడు" అని చిలుక పలుకులు పలుకుతారు. ఆ తర్వాత పెద్దయ్యాక ధర్మశాస్త్రం కొట్టివేయబడింది అంటారు. ఎంత విచిత్రమో చూడండి. పాత నిబంధన కొట్టి వేయబడింది, క్రొత్త నిబంధన మాకు సర్వస్వం అనే మన క్రైస్తవ సహోదరులకు క్రొత్త నిబంధనలో ఒక వాక్యం "ఆజ్ఞాతిక్రమమే పాపం. పాపం వల్ల జీతం మరణం" అని ఉంది. మరి ఈ లేఖనం సంగతేంటి? ఈ లేఖనం చదువుతారు కాని దీని భావం పట్టించుకోరు. ధర్మశాస్త్రం లేదంటారు, ఆజ్ఞలు పాటించరు. అసలు గ్రంధాన్నే పట్టించుకోరు.

మరి ఏ ముఖం పెట్టుకొని ఆయన రాకడ కోసం ఎదురుచూస్తున్నారు? లేఖనాలదారి లేఖనాలదే. వీరి దారి వీరిదే. ఆయన వస్తే మా సంఘం ఎత్తబడతాది అంటే మా సంఘం ఎత్తబడతాది అని పోటీపడుతున్నారు. నిజానికి ఆయన ఎదుర్కొనే సంఘం ఒక్కటే ఉంది. అవి ఈనాడు లోకంలో ఉన్న సంఘాలకు సంబంధించినది కాదు. ప్రపంచములో ఆయా దేశాలలో ఆయా ప్రాంతాలలో ఉంటూ యషువ మెస్సియందు విశ్వాసముంచి ఆయన నామములో బాప్తిస్మము పొంది ఆయన నియామక కాలములలో ఆయనను ఆరాధించుచూ ఎన్ని కష్టాలు, నష్టాలు ఎదురైనా ఆయన ఆజ్ఞలు, కట్టడలు పాటిస్తూ ఆయనే సర్వస్వంగా జీవించే విశ్వాసులే ఆ నిజమైన సంఘం. ఆ సంఘ మడత, మచ్చ, డాగు, కళంకం లేని వధువుకు సాదృశ్యం కాబట్టి సహోదరీ సహోదరులారా! యషువ మెస్సియ రాకడ గురించి ఎవరు ఏమి చెప్పిన / రాసినా తొందరపడి నమ్మేయకండి.

**అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగునుగాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను కుమారుడైనను ఎరుగరు.** (మత్తయి 24:36) **మీరనుకొనని గడియలో మనుష్య కుమారుడు వచ్చును గనుకనే మీరును సిద్ధంగా ఉండండి** (మత్తయి 24:44). ఇదే విషయాన్ని సౌలు థెస్సలోనీకయులకు రాసిన పత్రిక చెబుతున్నాడు.

**సహోదరులారా, ఆ కాలములను గూర్చియు ఆ సమయములను గూర్చియు మీకు వ్రాయనక్కరలేదు. రాత్రి వేళ దొంగ ఎలాగు వచ్చునో అలాగే ఎలోహీం యొక్క దినము వచ్చునని మీకు బాగుగా తెలియును.** (1థెస్స 5:1,2). స్వయంగా యషువ మెస్సియ ఆ సమయం గురించి చెప్పకుండా దాటవేస్తే మరి ఈ అబద్ధ ప్రవక్తలు ఎందుకు తొందరపడి 1998 సం॥రంలో వచ్చేస్తాడు, 2000 సం॥రంలో వచ్చేస్తాడు, 2004 సం॥రంలో వచ్చేస్తాడు అంటూ ప్రకటించేస్తున్నారు? కాబట్టి ఆ సమయం, ఆ గడియ గురించి మనం ఆలోచించడం మానివేసి ఈ లోకంలో మనలను ఏం చెయ్యమని యావె ఆజ్ఞాపించాడో ఆ పని చేస్తూ ఉండాలి. అదీ సిద్ధపడడం అంటే. దానియేలు, యోబు, నోవహు లాంటి నీతిమంతులు కడవరకు నీతిగా జీవించారు. గిద్యోను, బారాకు, సమ్సోను, యెఫ్తా దావీదు, సమూయేలు ఇంకా ప్రవక్తలు మన పితరులైన అబ్రహాం, ఇస్సాకు, యాకోబులు ద్నాలా వీళ్ళందరు యావె యందు విశ్వాసముంచి పూర్తిగా యావె సెలవిచ్చిన ప్రకారం జీవించి మృతినొందారు. మరి మనం కూడా ఆవిధంగా చేద్దామా... యషువ మెస్సియ రాకడ సమయంలో పైన పేర్కొనబడిన భక్తులందరూ మొదట లేస్తారు. ఆ తర్వాత యషువ మెస్సియ రాకడ సమయంలో సజీవులుగా ఉన్న నీతిమంతులు ఆ తర్వాత మెస్సియను చేరుకొంటారు. ప్రస్తుత తరములో ఉన్న మనం సత్యమైన వాక్యమేదో పరిశీలించి ఆ వాక్యప్రకారం మనం జీవిస్తే మనం మరణించినా, జీవించినా ఆ తండ్రి సన్నిధికి మనం చేరతాము.

యషువ మెస్సియ ఈ లోకానికి వెలుగై ఉన్నాడు. ఆ వెలుగులో నడుచుకొను ప్రతీవాడు వెలుగు సంబంధి. సాతాను చీకటి, అంధకారం అయి ఉన్నాడు. వాడ్ని అనుసరించే వాళ్ళందరూ చీకటి సంబంధులు. వెలుగులో ఉన్నవాడికే ఏదైనా కనబడుతుంది. ఏంజరిగినా తెలుస్తుంది. చీకటిలో ఉన్నవాడికి ఏమీ కనబడదు. ఏం జరిగినా వాడికి తెలియదు. యషువ మెస్సియ రాకడ వెలుగు సంబంధులుకే తెలుస్తుంది. కాబట్టి వారు ఆయనను ఎదుర్కొంటారు. ఈ చీకటి సంబంధులు ఏమీ కనబడక ఆయన వచ్చి వెళ్ళి పోయినా వీరికి తెలియదు. కాబట్టి వీరు ఈ భూమి మీద మిగిలిపోతారు. ఉగ్రతకు బలైపోతారు. మీరు వెలుగు సంబంధులా, చీకటి సంబంధులా అన్నది మీరే తేల్చుకోండి. **"నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవలకు వెలుగై యున్నది."** అంటాడు మహా భక్తుడైన దావీదు. అటువంటి వాక్యమును పరిశీలించి ఆప్రకారం చేసే వాడు వాక్య సంబంధి / వెలుగు సంబంధి. ఆప్రకారం చేయని ప్రతీవాడు చీకటి సంబంధి. మనం ఈ భూమ్మీద జీవించినంత కాలం ఏం చేయాలనేది మన పితరుడైన సొలొమోను ఒక్కముక్కలో తేల్చి చెప్పేసాడు **ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్ధమిదే; ఎలోహీంయందు భయభక్తులు కలిగిఉండి ఆయన కట్టడలననుసరించి నడుచుచుండవలెను; మానవకోటికి ఇదియే విధి.** ప్రసంగి 12:13

సమాధానకర్తయగు ఎలోహీం మిమ్మును సంపూర్ణముగా పరిశుద్ధపరచును గాక. మీ ఆత్మయు, జీవమును, శరీరమును మనప్రియుడైన యషువ మెస్సియ రాకడ యందు నిందా రహితముగాను, సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడును గాక! ఆమెన్.

# మూర్ఖులగు ఈ తరము వారికి వేరై రక్షణ పొందుట

**– బ్రదర్. పి. రాజు**

యషువ మెస్సియ మరణించి తిరిగిలేచిన తర్వాత తన శిష్యులకు కనబడి నలువది దినముల వరకు పరమతండ్రి రాజ్య విషయములను గూర్చి బోధించుచు, అనేక రుజువులను వారికి చూపి తన్ను తాను సజీవునిగా కనుపరచుకొన్నాడు. ఆయన తన శిష్యులకు – మీరు యెరూషలేము నుండి వెళ్ళక నావలన వినిన తండ్రి యొక్క వాగ్ధానము కొరకు కని పెట్టుడి. యోహాను నీళ్ళతో బాప్తిస్మము ఇచ్చెను గాని కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తీస్మము పొందెదరు అని ఆజ్ఞాపించాడు. ఆ వాగ్ధానం ప్రకారం పెంతుకోస్తు పండుగ దినమున అపోస్తులందరు. పరిశుద్ధాత్మతో నింపబడ్డారు. ఆ ఆత్మవారికి వారికి వాక్‌శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాటలాడారు. ఆ సంధర్భంలో ఆకాశము కింద నుండు ప్రతీ జనములో నుండి పెంతుకోస్తు పండుగకు వచ్చిన భక్తిగల యూదులు అపోస్తలులు అన్యభాషలతో మాట్లాడడం విని ఆశ్చర్యపోయారు. కొంతమంది యూదులు మాత్రము వీరు కొత్త మద్యముతో నిండి యున్నారని అపహాస్యం చేసిరి. అప్పుడు పేతురు వారికి యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన సంగతి ఈ రోజున నెరవేరినదని, భక్తుడైన దావీదు ద్వారా పలుకబడిన విధంగా మ్రాను వేయబడిన యషువ మెస్సీయ మరణించి తిరిగి లేచాడని ఆయనే పరిశుద్ధాత్మగా తమమీదికి దిగివచ్చాడని ఆ ఆత్మశక్తితోనే మేము ఈవిధంగా మాట్లాడుతున్నామని, ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలుసుకోవాలని చెప్పాడు. ఈ మాటలు విన్నకొంతమంది యూదులు తమ హృదయంలో నొచ్చుకొని తాము చేయవలసినది ఏమిటని అపోస్తులులను అడుగగా పేతురు – మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం ప్రతివాడు "యషువ మెస్సియ" నామమున బాప్తీస్మము పొందాలని వారికి ఆజ్ఞాపించాడు. ఇంకనూ అనేకమైన మాటలతో వారికి సాక్ష్యమిచ్చి – మీరు మూర్ఖులగు ఈ తరము వారికి వేరై రక్షణ పొందుదని వారిని హెచ్చరించడం జరిగింది. అపోస్తులుడైన పేతురు వాక్యము అంగీకరించిన ఇంచుమించు మూడు వేలమంది బాప్తీస్మము పొందారు.

అపోస్తలుల కాలంలో ఉన్న తరం వారిలో చాలామంది. యూదులు చాలా మూర్ఖంగా ప్రవర్తించేవారు. అపోస్తలుల బోధకు అడ్డు తగులుచూ వారి సేవకు అడుగడుగునా ఆటంకాలు కల్పించుచూ వారిని కొట్టుచూ, దూషిస్తూ, చంపుతూ ఉండేవారు. అంతేగాక అన్యులైన రోమీయుల చేతికి అప్పగించి వారిని చెఱసాలలో బంధించే దాకా వదలిపెట్టేవారు కారు. స్తెఫను రక్తం చిందించింది వీళ్ళే. పేతురును, సౌలును ఇతర విశ్వాసులను చెఱసాలలో పెట్టించారు. కొట్టించారు. పరిశుద్ధాత్మతో నిండి అన్య భాషలతో మాట్లాడుచున్న అపోస్తులులను కొత్తమద్యం తాగారని అపహాస్యం చేసారు. మూర్ఖత్వం కాకపోతే కొత్తమద్యం తాగితే కొత్త బాషలు వచ్చేస్తాయా? వీరి మూర్ఖత్వం కారణంగా శరీరధారియైన ఎలోహీంను వారు గుర్తించలేకపోయారు. పరిశుద్ధాత్మయొక్క శక్తినివారు గ్రహించలేకపోయారు. యూదుల రాజునే యూదులు బాధించి, మరణాన్ని అప్పగించారు. ఆ తరము వారిని గురించి యషువ మెస్సియ ఏమి సెలవిచ్చాడో చూద్దామా!

1. ఈ తరమువారు సంతవీధులలో కూర్చొని గిల్లికజ్జాలు పెట్టుకొనే పిల్లకాయలను పోలియున్నారు. (మత్తయి 11:16,17).
2. విశ్వాసం లేని మూర్ఖ తరము వారు (లూకా 10:41).
3. వ్యభిచారులైన చెడ్డ తరము వారు (మత్తయి 12:39).
4. దుష్ట తరము వారు (మత్తయి 12:45).
5. కొరాజీనా బేత్సయిదా పట్టణాలలో చేయబడిన అద్భుతాలనుబట్టి వారు మారు మనసు పొందలేదు కాబట్టి వీరికి పట్టబోవు గతికంటే సొదమ, గొమొఱ్ఱలకు పట్టిన గతే మంచిదని యషువ మెస్సియ చెప్పాడు (మత్తయి 11:20–24).
6. యోనా ప్రకటన విని నీనెవె వారు మారుమనస్సు పొందారు. కాని ఈతరం వారుమాత్రం యోనాకంటే గొప్ప వాడైన యషువ మెస్సియ మాటలు విని మారుమనస్సు పొందలేదు. (మత్తయి 12:41).
7. జ్ఞానియైన సొలొమోను మాటలు వినడానికి దక్షిణ దేశపురాణి భూమ్యంతరముల నుండి సొలొమోను దగ్గరకు వచ్చింది. కాని సొలొమోను కంటే గొప్పవాడైన యషువ మెస్సియ తానే స్వయంగా వారి యొద్దకు వెళ్లి బోధిస్తున్నా ఆయన మాటలను ఆతరం వారు పెడచెవిని బెట్టారు.

వ్యభిచారులైన చెడ్డ తరము వారు కాకపోతే చనిపోయి సమాధి చేయబడిన లాజరును నాలుగు రోజులు తర్వాత బ్రదికించిన యషువ మెస్సియను ఇంకొక సూచకక్రియ చేయమని అడుగుతారు? ఇంతకంటే గొప్ప సూచన క్రియ ఇంకేమి ఉంటుంది? ఈవిధముగా వారు ఆయనను నమ్మనందు వలన ఆ తరం వారిచేత యషువ మెస్సియ ఉపేక్షింపబడ్డాడు. అయితే ముందుగా ఆయన అనేక హింసలు పొంది యీ తరము వారిచేత ఉపేక్షింపబడవలెను. (లూకా 18:25) ఈవిధంగా వారి అవిశ్వాసంవల్ల, వారి పితరులు – ప్రవక్తలు, రక్తము చిందించిన కారణంగా కలిగిన హత్యాదోషం నిమిత్తం ఆ తరము వారు విచారింపబడతారని యషువ మెస్సియ ప్రవచించడం జరిగింది (లూకా 11:51) ఆ ప్రవచనం ప్రకారము ఇశ్రాయేలీయులు పరిశుద్ధ పట్టణమైన యెరూషలేమునుండి బయటకు వెళ్ళగొట్టబడ్డారు. యిర్మీయా ప్రవచించిన విధంగా ప్రపంచంలోని అన్ని దేశాలలోకి వారు చెదరిపోయారు. ఎంతోమంది యూదులు ఆయా దేశాలలో ఎన్నో బాధలు పడ్డారు. తమ ధన, మాన, ప్రాణాలను కోల్పోయారు. ఆ తర్వాత వాక్యం అన్యజనుల మధ్యకు వచ్చింది. ఈ వాక్యాన్ని పోపులు హైజాక్ చేసి మొత్తం తమ గుప్పిట్లోకి తీసుకొని సామాన్య ప్రజలకు వాక్యం అందనీయకుండా చేసి తాము ఆడింది ఆట తాము పాడింది పాటగా అధికారం చెలాయించారు. ఆతరంలో పోపులు వారి అనుచరలు (బిషప్పులు, ఫాదర్‌లు మొదలగు వారు) చాల మూర్ఖంగా ప్రవర్తించారు. ఎవరైనా వాక్య విషయంలో ఎదురుచెప్తే వారిని నానాక్రూరమైన హింసలకు గురిచేసి చంపేవారు. ఇలా చంపబడిన వారి లెక్క కొన్ని లక్షల్లోనే ఉంటుంది.

ఈ పోపులు ప్రవేశపెట్టిన మూర్ఖసిద్ధాంతాలలో మచ్చుకు కొన్ని చూద్దాం.

1. పోప్ లేదా బిషప్పు లేదా ఫాదర్ ఆశీర్వదించిన తరువాత రొట్టె మెస్సియ యొక్క శరీరంగా మారుతుంది ద్రాక్షారసం మెస్సియ రక్తంగా మారుతుంది.
2. రోమా సంఘం అన్ని సంఘాలకు శిరస్సు
3. పోపులకు మాత్రమే సంఘ తాళపు చెవులు ఇవ్వబడ్డాయి.
4. ప్రజలను శిక్షించుటకు పోపు, బిషప్పులకు అధికారముంది.
5. పరిశుద్ధ గ్రంధాన్ని సామాన్యు లెవరూ చదువకూడదు.
6. సువార్తను బహిరంగంగా బోధించకూడదు.
7. పాప పరిహార పత్రాల వల్ల చనిపోయిన పితరుల పాపాలు క్షమించబడతాయి.
8. యషువ మెస్సియను వదిలేసి ఆయన తల్లి మరియను పూజించుట మొదలైనవి.

ఈ మూర్ఖ సిద్ధాంతాలను ఎదిరించిన ఎంతోమంది భక్తులు హత సాక్షులయ్యారు. ఈ కాలంలోనే మార్టిన్‌లూథర్ పరిశుద్ధ గ్రంధాన్ని జర్మన్ భాషలోనికి తర్జుమా చేయడం జరిగింది. ఆ తర్వాత అన్ని భాషలలోనికి పరిశుద్ధ గ్రంథం తర్జుమా చేయబడింది. జాన్‌గూటెన్ బర్గ్ కనిపెట్టిన అచ్చుయంత్రం మూలంగా అన్ని భాషలలోనికి బైబిల్ ముద్రించడం పంపిణీ చేయడం జరిగింది. ఇలా భాషలు మారిన క్రమంలో మూలభాష నుండి ఇతర భాషలలోనికి గ్రంధాన్ని తర్జుమా చేసే సమయంలో ఎన్నో అతి ప్రాముఖ్యమైన విషయాలు వదలి వేయబడి, మూల భాషయైన హిబ్రూలో వ్రాయబడిన కొన్ని విషయాలు చేర్చబడ్డాయి. వీటిని సత్యమని నమ్ముతున్నారు ఈనాటి మనతరం. మనముందు తరాలవారు తమకు దొరికిన దాంట్లోనే నీతిగా జీవించారు. నేడు ఎంతోమంది స్కాలర్స్ ఎంతో పరిశోధన చేసి హెబ్రీ భాషలో వ్రాయబడిన పరిశుద్ధ గ్రంధాన్ని ఉన్నదున్నట్లుగా తర్జుమా చేసేసరికి ప్రస్తుతమున్న బైబిల్‌లో అనేక లోపాలు బయట పడ్డాయి. ఆ లోపాలు బయట పెట్టి, మరుగైపోయిన సత్యాన్ని వెలికి తీసి సత్యమైన వాక్యప్రకారం నడవమంటే మేము నడవమంటున్నారు ఈ తరపు మూర్ఖజనం. ఉదాహరణకు తెలుగు బైబిల్ మొదటి పేజీలో "ఇది ఆదిమ హెబ్రీ గ్రీకు భాషలలో నుండి భాషాంతరం చేయబడినది" అని ఉంది. కాని హెబ్రీ భాషలో వ్రాయబడిన గ్రంధానికి ఈ బైబిల్‌కు చాలా తేడా ఉంది. హెబ్రీ భాషలో రాయబడిన పట్టణాల పేర్లు, ప్రవక్తలపేరు చాలా వరకు తెలుగులోనికి ఉన్నదున్నట్లు రాశారు. కాని అతిముఖ్యమైన సృష్టికర్త పేరు మాత్రం హెబ్రీలో ఒకలాగ ఉంటే తెలుగులో ఇంకోలాగ మార్చివేశారు. ఆవిధంగా యావె – యెహోవాగా, యషువ మెస్సియ – యేసుక్రీస్తుగా మారిపోయాయి. ఏ భాషలో ఉన్న బైబిల్‌ను చూసినా కనిపించని క్రిస్మస్, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్, క్రొత్త సం॥రం పండుగలు వాడుకలోనికి వచ్చాయి. ఈ పండుగలు కేవలం మానవులు కల్పించుకొన్నవి. పరమతండ్రి పండుగ కాలాలు వేరే ఉన్నాయి. ఈ విషయాలన్ని సర్వశక్తిమంతుడైన యావె ప్రతీ తరానికి ఏర్పరచుకొన్నట్లే నేడు కూడ కొంతమందిని ఏర్పరచుకొని ప్రకటింప చేస్తుంటే ప్రతీతరంలోను మూర్ఖులు చేసినట్లే ఈ తరంలోకూడ సత్యాన్ని వినడం లేదు, విన్న సత్యాన్ని లక్ష్యపెట్టడం లేదు.

పరమతండ్రి చేత ఆదేశింపబడి ఆయా కాలాల్లో ఆయా భక్తులు పరమతండ్రి. మాటలను పుస్తకాలుగా రాస్తే సాతాను చేత ఆవరించబడిన కొంతమంది వ్యక్తులు ఆ పుస్తకాలలోని వాక్యాలను కొన్నింటిని తీసివేసి కొన్నింటిని కలిపారు. ఈ విషయాలను ఎవరైనా ప్రస్తావిస్తే వారి అసలు రంగు ఎక్కడ బయటపడుతుందో ప్రకటన గ్రంథంలోని 22 అధ్యాయం, 18,19 వచనాలను చూపించి బెదరగొడుతున్నారు. చాలా పకడ్బందీగా సాతాను గురుగులను గోధుమ చేలో చల్లేశాడు. అయితే పరమ తండ్రి మనకిచ్చిన జ్ఞానాన్ని ఉపయోగించి గురుగులను ఏరిపారేసి గోధుమలను మనం పోగేసుకోవాలి. ఆ పని ఎవరూ చేయడం లేదు. అసలు పరిశుద్ధగ్రంధాన్ని శ్రద్ధగా చదువుతున్న వారెంతమంది? శ్రద్ధగా చదివి అందులోని విషయాలను గ్రహిస్తున్న వారెంతమంది? గ్రహించిన విషయాలను ఆచరణలో పెడుతున్నవారెంతమంది? చాలా అతి తక్కువమంది మాత్రమే ఆవిధంగా చేస్తున్నారు. ఈ ప్రపంచంలో అత్యధికంగా ముద్రించబడుతున్న గ్రంథం బైబిల్. అధికారంగా, అనధికారంగా దాదాపు 200 కోట్లమంది క్రైస్తవులు ఉన్నారు. ఎన్నో వందల సంఘాలు, ఆ సంఘాలకు చెందిన లక్షల చర్చ్‌లు ఉన్నాయి. ఎంతోమంది బోధకులు ఉన్నారు. పత్రికల ద్వారా, రేడియోల ద్వారా టీవీల ద్వారా, కంప్యూటర్‌ల ద్వారా సువార్తే సువార్త. 24 గంటలు శుభవార్తే "శుభవార్త" అయినా భూమి మీద పాపం అంతకంతకూ పెరిగిపోతుంది. దీనికి కారణం ఏమిటంటే ఈ మానవజాతి ఎలోహీం అయిన యావె యొక్క ఆజ్ఞలను, కట్టడలను అతిక్రమించడమే. "ఆజ్ఞాతి క్రమమే పాపం" అని లేఖనాలు చెబుతున్నాయి. నమ్మి బాప్తీస్మం పొందితే చాలు ఇంకేమి అక్కరలేదు అని బోధకులు బోధిస్తున్నారు. పరమతండ్రి మాటకంటే ఈబోధకుల మాటకే విలువిచ్చి ఆజ్ఞలు కట్టడలు గాలికొదిలేశారు. దాని ఫలితమే ఇప్పుడు ప్రపచంలో ఇన్ని దారుణాలు జరుగుతున్నాయి. బైబిల్‌ను ఆదికాండం నుండి మలాకీ వరకు పాతనిబంధన అని, మత్తయి నుండి ప్రకటన వరకు క్రొత్త నిబంధన అని విభజించారు. ఇలా విభజించడం వల్ల అనేకమైన తప్పుడు అర్థాలు తీసి అసలు అర్థం గ్రహించకుండా చేస్తున్నారు ఈనాటి బోధకులు. ఈ విభజించమని పరమతండ్రి ఎక్కడైనా ఎవరికైనా ఆదేశించాడా? మీరే చెప్పండి. అపోస్తులుడైన సౌలు తన రక్త సంబంధికులైన ఇశ్రాయేలీయులను వారి రక్షకుడైన యషువ మెస్సియవైపు త్రిప్పడానికి ప్రయత్నం చేస్తూ గతంలో మోషే కోడెల యొక్కయు, మేకల యొక్కయు రక్తంతో చేసిన నిబంధన కంటే మరిశ్రేష్ఠమైన నిబంధన యషువ మెస్సియ తన రక్తంతో చేశాడని, ఇప్పుడు అందరూ యషువ మెస్సియ రక్తం ద్వారా పాపవిమోచన పొందారని కాబట్టి ఇశ్రాయేలీయులు మోషే చేసిన పాత నిబంధన నుండి యషువ మెస్సియ చేసిన క్రొత్త నిబంధన కిందకు వస్తారనే ఉద్దేశ్యంతో పాత నిబంధన కొట్టివేయబడెనని అంటే ఆదికాండం నుండి మలాకీ గ్రంథ వరకు కొట్టి వేసాడని ఈ మూర్ఖ తరంవారు అనుకొని ఇకఏమి చెయ్యనక్కరలేదని సంబరపడిపోతున్నారు. కనీసం ఇప్పుడైనా కళ్ళు తెరచి వాస్తవం గ్రహిచండి హెబ్రీయులకు రాసిన పత్రిక 8:8–13 చూచినట్లయితే అక్కడ రెండు నిబంధనలు ఉన్నాయి. ఆ లేఖనాల ప్రకారం చూస్తే ఐగుప్తులో నుండి ఇశ్రాయేలీయులను వెలుపలికి తీసుకొని వచ్చి వారికి ధర్మశాస్త్రం ఇచ్చాడు. ఆయన రాతిలపకల మీద రాసి యిచ్చాడు. అయితే ఇశ్రాయేలీయులు ఎన్నోసార్లు ధర్మశాస్త్రం నుండి తొలగిపోయారు. కాబట్టి ఈసారి పరమతండ్రి వారి హృదయాల మీద ఆయన ధర్మ విధులను రాస్తానని నిబంధన చేసాడు. రాతి పలకల మీద రాసివ్వడం పాత నిబంధన అయితే హృదయాల మీద రాయడం కొత్త నిబంధన. అదేవిధంగా యషువ మెస్సియ ఈలోకానికి వచ్చినప్పుడు ఇశ్రాయేలీయులతో అన్న మాటలను గుర్తుకు తెచ్చుకొండి "ఒక స్త్రీతో శారీరకంగా కలిస్తే ధర్మశాస్త్రం ప్రకారం వ్యభిచారమయితే హృదయమందు మోహపు చూపు చూస్తేనే వ్యభిచారమని మెస్సియ ధర్మశాస్త్రాన్ని ఇశ్రాయేలీయుల హృదయాల మీద రాసాడు. కాబట్టి సహోదరులారా! మీరు మీ తప్పుడు ఆలోచనలు, తప్పుడు సిద్ధాంతాలు కట్టిపెట్టి వాక్యము వైపు మీ మనస్సు త్రిప్పండి. ఈ లోకంలో జ్ఞానులమనుకొని వారిని గౌరవించడం కాకుండా పరమతండ్రి యొక్క వాక్యాన్ని గౌరవించండి. "ఈ లోక జ్ఞానం పరమతండ్రి దృష్టికి వెఱ్ఱితనంగా ఉన్నది" అని లేఖనాలు సెలవిస్తున్నాయి. ఆ మధ్య ఒక యువ న్యాయవాది కమ్ పాస్టర్‌గారు ఆయన ఒక ప్రసిద్ధి చెందిన సంఘానికి ప్రాతినిధ్యంవహిస్తున్నారు. మా సంఘమే అసలైన సంఘం మిగతా సంఘాలు పేరు ఏవీకూడా బైబిల్‌లో లేవు అని విర్రవీగుతూ ఉండేవాడు. ఒకసారి బ్రదర్ ఐజక్ గారికి ఫోన్ చేసి ధర్మశాస్త్రం కొట్టి వేయబడింది అని మాట్లాడాడు. వెంటనే బ్రదర్. ఐజక్ గారు నీవు ఒక న్యాయవాదివైయుండి 'లా' లేదని ఎలా చెప్తుతున్నావు? అని ప్రశ్నిస్తే దెబ్బకు దిమ్మ తిరిగి ఇంకేమీ మాట్లాడలేకపోయాడు. సహోదరులారా! పరమతండ్రి సమస్త మానవాళికి అనుగ్రహించిన చట్టమే ధర్మశాస్త్రం. ఆ చట్టాన్ని అతిక్రమించడమే పాపం. పాపం వల్ల వచ్చు జీతం మరణం. ధర్మశాస్త్రమును పాటించడమే నీతి. నీతి వల్ల వచ్చు జీతం నిత్యజీవం. ఈ సందర్భంగా భక్తుడైన దావీదు కీర్తన స్మరణకు తెచ్చుకొందాం. "దుష్టుల ఆలోచనల చొప్పున నడువక పాపుల మార్గమున నిలువక, అపహాసకులు కూర్చుండు చోటను కూర్చుండక యావె ధర్మశాస్త్రమందు ఆనందించుచూ దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు. అతడు నీటి కాలువల యోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె ఉండును. అతడు చేయునదంతయు సఫలమగును" అయితే ప్రతీ తరములోను పరమతండ్రి యందు విశ్వాసముంచి ఆయన ఆజ్ఞలను, కట్టడలను పాటించుచూ కడవరకు ఎలోహీం మీదనే ఆధారపడి జీవించిన కొంతమంది భక్తులు ఉన్నారు. అపోస్తులుడైన సౌలు ఫిలిప్పీయులను గూర్చి ఏమని సాక్ష్యమిస్తున్నాడో చూడండి. మీరు మూర్ఖులైన వక్రజనము మధ్య, నిరపరాధులును నిష్కళం

కులును అనింద్యులునైన ఎలోహీం కుమారులగునట్లు సంశయములను మాని, సమస్త కార్యములను చేయుడి. అట్టి జనము మధ్యను మీరు జీవవాక్యము చేతపట్టుకొని లోకమందు జ్యోతుల వలె కనబడుచున్నారు. (ఫిలిప్పీ 2:14) ప్రస్తుత తరములో ఉన్నవారు కూడ సత్యమైన వాక్యం చేతపట్టుకొని జ్యోతుల వలె వెలగాలనే ఉద్దేశ్యంతో మీ కోసం ఎన్నో సంగతులను పత్రికల ద్వారా, వెబ్‌సైట్ ద్వారా ప్రకటించడం జరుగుతున్నది. కాబట్టి మీలో ఎవరైనా ఈ మూర్ఖతరము వారికి వేరై రక్షణ పొందాలనుకొంటే వెంటనే మా వెబ్‌సైట్‌ను www.aotle-india.org సందర్శించండి. సర్వశక్తిమంతుడైన యావె మిమ్ములను సత్యము నుండి సర్వ సత్యములోనికి నడిపించును గాక! ఆమెన్.

# O.T. అవుట్‌లైన్

– బ్రదర్. యస్. స్యామ్ డానియెల్

| | | | |
|---|---|---|---|
| BC 4114 - 3184 | ఆదామ్ | (930 సం॥లు) | ఆది 5:5 |
| BC 3984 - 3072 | షేత్ | (912 సం॥లు) | ఆది 5:8 |
| BC 3879 - 2974 | ఏనోష్ | (905 సం॥లు) | ఆది 5:11 |
| BC 3789 - 2879 | కెయినాన్ | (910 సం॥లు) | ఆది 5:14 |
| BC 3719 - 2824 | మహలేల్ | (895 సం॥లు) | ఆది 5:17 |
| BC 3654 - 2692 | యెరెద్ | (962 సం॥లు) | ఆది 5:20 |
| BC 3492 - 3127 | హనోక్ | (365 సం॥లు) | ఆది 5:23 |
| BC 3427 - 2458 | మెతూషెల్ | (969 సం॥లు) | ఆది 5:27 |
| BC 3240 - 2463 | లెమక్ | (777 సం॥లు) | ఆది 5:31 |
| BC 3058 - 2108 | నోవహు | (950 సం॥లు) | ఆది 9:29 |
| BC 2558 - 1958 | షేమ్ | (600 సం॥లు) | |
| BC 2458 | జలప్రళయం – జలప్రళయం | | |
| BC 2456 - 2018 | అర్పక్షద్ | (438 సం॥లు) | |
| BC 2421 - 1988 | సలా | (433 సం॥లు) | |
| BC 2391 - 1927 | ఎబెర్ | (464 సం॥లు) | |
| BC 2357 - 2118 | పెలెగ్ | (239 సం॥లు) | |
| BC 2357 - 2118 | బాబెలు గోపురం కట్టుట, జనములు చెదరగొట్టబడుట, భూమి విభాగించుట | | |
| BC 2327 - 2088 | రేయ్ | (239 సం॥లు) | |
| BC 2295 - 2065 | సెరూగ్ | (230 సం॥లు) | |
| BC 2265 - 2117 | నాహోర్ | (148 సం॥లు) | |
| BC 2236 - 2031 | తెరహ్ | (205 సం॥లు) | ఆది 11:32 |
| BC 2166 - 1991 | అబ్రహామ్ | (175 సం॥లు) | ఆది 25:7 |
| BC 2066 - 1886 | ఇస్సాక్ | (180 సం॥లు) | ఆది 35:8 |
| BC 2006 - 1859 | ఇశ్రాయేల్ | (147 సం॥లు) | |
| BC 1920 - 1300 | **ఐగుప్తు** | **(మొదటి ప్రపంచ సామ్రాజ్యము)** | |
| BC 1914 - 1804 | యోసెఫ్ | (110 సం॥లు) | ఆది 50:26 |
| BC 1897..... | యోసెఫ్ ఐగుప్తుకు........ | | |
| BC 1876.... | ఇశ్రాయేల్ ఐగుప్తుకు..... | | |
| BC 1859.... | ఇశ్రాయేల్ మరణం..... | | |
| BC 1804.... | యోసెఫ్ మరణం | | |
| BC 1876 - 1446 | | (430 సం॥లు) ఇశ్రాయేలీయులు ఐగుప్తులో (గలతీ 3:17) | |
| BC 1526 - 1406 | మోషే | (120 సం॥లు) | ద్వితీ 34:7 |
| BC 1500 - 1390 | యెహోషువ | (110 సం॥లు) | యెహో 24:29 |
| BC 1446 - 1406 | | (40 సం॥లు) | ఇశ్రాయేలీయులు అరణ్యంలో తిరుగుట |
| BC 1406 - 1390 | ఇశ్రాయేలీయులు కానానును స్వతంత్రించుకొనుట | | |
| BC 1390 - 1095 | న్యాయాధిపతుల కాలము | | |
| BC 1300 - 606 | **అష్షూరు (రెండవ ప్రపంచ సామ్రాజ్యము)** ప్రకటన 17:10 | | |
| BC 1095 - 975 | ఇశ్రాయేలీయులు కలిసిఉండుట (United Kingdom) | | |
| BC 975.... | రాజ్యము చీలిపోవుట (Divided Kingdom) | | |
| BC 975 - 734 | ఇశ్రాయేలీయుల రాజ్యము | | |
| BC 734..... | అష్షూరు చెరకు పోవుట | | |
| BC 975 - 606 | యూదా రాజ్యము | | |
| BC 606 - 536 | **బబులోను (మూడవ ప్రపంచ సామ్రాజ్యము)** దాని 2:38, 7:4, ప్రకటన 17:10) | | |
| BC 606..... | యూదులు బబులోను చెరకు పోవుట | | |
| BC 606..... | దానియేల్ బబులోనుకు కొనిపోవుబడుట | | |
| BC 599..... | యెహెజ్కేల్ బబులోనుకు కొనిపోబడుట | | |
| BC 588..... | యెరూషాలేం పట్టబడుట | | |
| BC 536 - 331 | **పర్షియా (నాలుగవ ప్రపంచ సామ్రాజ్యము)** దాని 2:39, 7:5, ప్రకటన 17:10 | | |
| BC 536 - 425 | పునరుద్ధీకరణ ప్రారంభం అవ్వుట | | |
| BC 536...... | యెరుబ్బాబెలు తిరిగి వచ్చుట | | |
| BC 536 - 515 | హగ్గయి, జెకర్యా | | |
| BC 457...... | ఎజ్రా తిరిగివచ్చుట | | |
| BC 457..... | యెరూషలేంను తిరిగి కట్టాలనెడి ఆజ్ఞ | | |
| BC 445..... | నెహెమ్యా తిరిగి వచ్చుట | | |
| BC 432 - 425 | మలాకీ | | |
| BC 425 - 004 | మెస్సీయ కొరకు ఎదురుచూచుట | | |
| BC 331 - 168 | **గ్రీకు (అయిదవ ప్రపంచ సామ్రాజ్యము)** దాని 2:39, 7:6, ప్రక 17:10 | | |
| BC 331......... | అలెగ్జాండర్ దిగ్రేట్..... (దాని 8:5-8) | | |
| BC 318......... | టొలెమి 1 ఐగుప్తురాజు యెరూషలేంను తీసుకొనుట (BC 323 - 283, దాని 11:5) | | |
| BC 300......... | సైమన్ అను నీతిగల ప్రధానయాజకుడు | | |
| BC 292........ | ఎలియాజర్ ప్రధానయాజకుడు | | |
| BC 251........ | మనష్షే ప్రధానయాజకుడు | | |
| BC 219 - 198 | అంతియోకస్ అను సిరియా రాజు యెరూషలేమ్‌ను జయించుట (దాని 11:13, BC 323 - 187) | | |
| BC 198........... | అంతియోకస్ ఎఫిఫానిస్ సిరియా రాజు (దాని 11:21,32) | | |
| BC 174 - 171 | 40,000 యూదులను చంపుట, యెరూషలేం ఆలయంను పాడుచేయుట మొ॥నవి (దాని 11:21-32) | | |
| BC 168........... | రోమా సామ్రాజ్యం ద్వారా గ్రీసు పట్టబడుట | | |
| BC 168 - AD 476 | **రోమా (ఆరవ ప్రపంచ సామ్రాజ్యము)** | | |
| BC 166....... | అంతియోకస్ ద్వారా నిలిపివేయబడిన రోజువారీ బలులు మరళా పునరుద్ధీకరించుట (జూదా) | | |
| BC 166 - 63 | యూదుల స్వపరిపాలన | | |
| BC 166 - 160 | యూదా మక్కాబీయుల నాయకుడు | | |
| BC 160 - 142 | యోనాతాన్ ప్రధానయాజకుడు | | |
| BC 100 - 44 | జూలియస్ సీజర్ రోమ్ సామ్రాజ్యనేత | | |
| BC 66 ........ | సిరియా రోమ్ పరిపాలనలో | | |
| BC 37 - 04 | హేరోద్ ఘనతవహించిన యూదయరాజు | | |
| BC 30...... | ఐగుప్తు రోమ్ పరిపాలనలో | | |
| BC 27 - AD 13 | కైసరు అగస్టస్ రోమ్ అధికారి (లూకా 2:1) | | |
| BC 12 - BC 4 | కురేనియస్ సిరియా గవర్నర్ (లూకా 2:2) | | |
| BC 4............. | బాప్తిస్మమిచ్చు యోహాను జననము | | |
| BC 4............. | 6 నెలల తర్వాత యషువ మెస్సీయ జననము | | |
| BC 4 - AD 37 | అర్కెలాస్ (మత్తయి 2:22) యూదయరాజు | | |
| AD 13 - AD 37 | తిబేరియస్‌లోని సీజర్ (లూకా 3:1) | | |
| AD 27 - AD 36 | పొంతిపిలాతు (మత్తయి 27:2) | | |
| AD 27 | యషువ మెస్సీయ బాప్తిస్మము (లూకా 3:23) | | |
| AD 27- AD 31 | యషువ మెస్సీయ $3^{1/2}$ సం॥ల యూదుల మధ్య సువార్త సేవ (దాని 9:27) | | |
| AD 31 | యషువ మెస్సీయ మరణము | | |
| AD 31 - AD 34 | అపోస్తలులు $3^{1/2}$ సం॥లు యూదుల మధ్య సువార్త సేవ | | |

# పెంతెకోస్తు గందరగోళం – 2

## యెహోషువ 5:10,11,12 వచనాలు

– బ్రదర్. ఐజక్ ఇ. కుసుమ

1. పస్కా మొదటిరోజున వస్తే.................. 1వ రోజు పెంతెకోస్తు .......... సీవాన్ 11న వస్తుంది
2. పస్కా రెండవరోజున వస్తే .................. 1వ రోజు పెంతెకోస్తు .......... సీవాన్ 10న వస్తుంది
3. పస్కా మూడవరోజున వస్తే................. 1వ రోజు పెంతెకోస్తు ............ సీవాన్ 9న వస్తుంది
4. పస్కా నాలుగవ రోజున వస్తే............... 1వ రోజు పెంతెకోస్తు ............ సీవాన్ 8న వస్తుంది
5. పస్కా ఐదవరోజు వస్తే...................... 1వ రోజు పెంతెకోస్తు ............ సీవాన్ 7న వస్తుంది
6. పస్కా ఆరవరోజన వస్తే..................... 1వ రోజు పెంతెకోస్తు ............ సీవాన్ 6న వస్తుంది
7. పస్కా ఏడవరోజున వస్తే.................... 1వ రోజు పెంతెకోస్తు .......... సీవాన్ 12న వస్తుంది

11,10,9,8,7,6,12 తేదీలన్నీ ఆదివారమునే వచ్చును

అలా యెహోషువ 5:10,11,12 వచనాల ప్రకారం ఆ సం॥ము 6నే వచ్చి ఉండవచ్చు, కాదానడాన్కి ఏముంది? ప్రతీ సం॥ము 6నే వస్తాది అనడాన్కి ఆధారం ఎక్కడ? గనుక యెహోషువ 5:10,11,12 వచనాలు తీసి అబద్ధికులైన సబ్బాతీయులు గారిడీ చేద్దామనుకున్నా వాక్యం ఒప్పుకోదు. గనుక సత్యాన్వేషులు కంగారు పడవలసింది లేదు. మెస్సీయను శోధించిన సాతాను కూడా వాక్యమునే (మత్తయి 4:6 కీర్తనలు 91:11) వక్రీకరించి ఇలా వ్రాయబడి ఉంది అని అంది. మెస్సీయ అయితే వేరొకచోట ఇలా వ్రాయబడి ఉంది అంటూ దానిని త్రిప్పికొట్టాడు. సాతాను బోధకులు వాక్యం చెపుతూ కుయుక్తిగా బోధిస్తూ ఉంటారు. వాక్యానికి వంకర వ్యాఖ్యానం చేస్తూ, తప్పుడు అర్ధాలు చెపుతూ ఉంటారు. వాటిని ఆత్మ సంబంధులు మాత్రమే పసిగట్టగలరు. మిగతా వారంతా వారి మోసంలో కూరుకుపోతారు. వారి తప్పుడు లెక్కను కూడ చూద్దామా? వారికి

1. పస్కా మొదటిరోజున వస్తే.................. పెంతెకోస్తు 3వ రోజు ............ సీవాన్ 6న వస్తుంది
2. పస్కా రెండవరోజున వస్తే .................. పెంతెకోస్తు 4వ రోజు ............ సీవాన్ 6న వస్తుంది
3. పస్కా మూడవరోజున వస్తే................. పెంతెకోస్తు 5వ రోజు ............ సీవాన్ 6న వస్తుంది
4. పస్కా నాలుగవ రోజున వస్తే............... పెంతెకోస్తు 6వ రోజు ............ సీవాన్ 6న వస్తుంది
5. పస్కా ఐదవరోజు వస్తే...................... పెంతెకోస్తు 7వ రోజు ............ సీవాన్ 6న వస్తుంది
6. పస్కా ఆరవరోజున వస్తే.................... పెంతెకోస్తు 1వ రోజు ............ సీవాన్ 6న వస్తుంది
7. పస్కా ఏడవరోజున వస్తే.................... పెంతెకోస్తు 2వ రోజు ............ సీవాన్ 6న వస్తుంది

3,4,5,6,7,1,2 రోజులన్నీ సీవాన్ 6నే వచ్చును. వీళ్ళలోనే మరో రెండు గ్రూపులున్నాయి. వాళ్ళు పెంతెకోస్తు ఎప్పుడూ సీవాన్ 6నే రాదు, 7,8 తేదీల్లో కూడా వస్తూ ఉంటాది అని చెప్తారు. మరి వాళ్ళ లక్కలెలాగో వారినే అడిగి తెలుసుకోవాలి.

ఒక్కటి మాత్రం ఖచ్చితం అది ఏమంటే "పెంతెకోస్తు ఎప్పుడూ సీవాన్ 6న రాదు" అట్లా వచ్చేలా అయితే పరమతండ్రియైన యావె అన్ని పండుగలకు తేదీలు యిచ్చినట్లే దీనికి కూడా తేదీ చెప్పియుండెడివాడు. కాని దీనికి తేదీ చెప్పక లెక్కపెట్టమని చెప్పాడు.

| | | |
|---|---|---|
| **1.** | పస్కా | **నీసాన్ 14** |
| **2.** | పు॥రొ॥ పండుగ | **నీసాన్ 15-21** |
| **3.** | పెంతెకోస్తు | **తేదీ చెప్పలేదు** |
| **4.** | జ్ఞాపకార్థం శృంగధ్వని | **ఏతనీమ్ 1** |
| **5.** | పాప ప్రాయశ్చిత్తార్థ దినము | **ఏతనీమ్ 10** |
| **6.** | పర్ణశాలల పండుగ | **ఏతనీమ్ 15-21** |
| **7.** | అంత్యమహా దినము | **ఏతనీమ్ 22** |

గనుక పరమతండ్రి ఇవ్వని తేదీని ఇచ్చేది చెప్పేది సాతాను మాత్రమే.

ఎప్పుడూ ఆదివారమే ఎలా వస్తుంది? అది వీరి బాధ. ఇది అర్థం కాక "గుడ్‌ఫ్రైడే – ఈస్టర్ సన్‌డే" కి ముడిపెట్టేస్తున్నారు. లెంట్ లెక్కలు ఏమిటో తెలుసుకోకుండా మాట్లాడుట మంచిది కాదు. ముందుగా బస్మబుధవారము – లెంట్ – గుడ్‌ఫ్రైడే – ఈస్టర్ సన్‌డేల సంగతి తెల్సుకుంటే మంచిది. మీరు కేథలిక్స్ దగ్గరకు, ప్రొటెస్టంటులు దగ్గరకు వెళ్ళి ఆ లెక్కలు నేర్చుకోండి. ఆ లెక్కలుకి పెంతెకోస్తు లెక్కలుకి అసలు సంబంధం లేదు.

లేవీ 23:15,16 ప్రకారం విశ్రాంతిదినమునకు మరునాటి నుండి 7 విశ్రాంతిదినములు గల 7 వారములు లెక్కిస్తే అది ఖచ్చితంగా ఆదివారమే వస్తుంది.

తమరు కూడా ఇదే కౌంటింగ్ తప్పుగా చేస్తూ 7 వారములు అని లెక్కిస్తూ సీవాన్ 6కే వస్తుందని ఋజువు చేయ ప్రయాపడుచున్నారు. గనుక తమరి లెక్కె తమరు చెప్పినట్లు "గుడ్‌ఫ్రైడే – ఈస్టర్ సన్‌డే" లెక్కల వలె ఉందేమో తమరే గ్రహించుకోవాలి.

పెంతెకోస్తు ఎప్పుడు సీవాన్ 6నే వస్తుందని అబద్ధములు చెప్తున్న మీరు అది ఏరోజో చెప్పగలరా? మీకు 3,4,5,6,7,1,2 రోజులన్నీ సీవాన్ 6నే వస్తున్నప్పుడు మీరు యెహోషువ 5:10,11 వచనాల ప్రకారం అది ఏ రోజో మీరు చెప్పండి చెప్పగలరా? చెప్పలేరు. కాని మేము చెప్పగలం. పస్కా ఆరవ రోజున వస్తేనే పెంతెకోస్తు 1వ రోజు (ఆదివారం వస్తుంది. గనుక యెహోషువ 5:10,11 వచనాల ప్రకారం ఆరోజు ముమ్మాటికీ ఆదివారం అయ్యి ఉండాలి. ఆ సం॥ము పస్కా ఆరవ రోజున వచ్చి ఉండాలి. వాక్యములో మీ గారడీకి తావులేదు.

Edited, Printed, Published and Owned by Isaac E. Kusuma for AOTLE -India Ministries, Malikipuram - 533 253, E.G.Dt., A.P., India